క్లుప్తంగా...

'డబుల్' ఇళ్లవాసులకు నీటి కనెక్షన్లు

రసూల్‌పురా: రెండవ వార్డు సిల్వర్ కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్‌లలో నివసిస్తున్న వారికి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా బోర్డు వాటర్ వర్క్స్ అధికారుల ఆధ్వర్యంలో నీటి కనెక్షన్ల ఏర్పాటు ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. గత ఆరు నెలల క్రితం దివంగత ఎమ్మెల్యే సాయన్న తాగునీటి పైపులైను పనులకు శంకుస్థాపన చేశారు. ప్రతి బ్లాక్‌కు ఎనిమిది నల్లా కనెక్షన్ల చొప్పున మొత్తం ఆరు బ్లాకులకు గాను 48 కనెక్షన్లు ఇవ్వనున్నారు. మూడ్రోజుల్లో నీటి కనెక్షన్ల పనులను పూర్తవుతాయని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో మహిళల చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ మేయర్

లాలాపేట: బీఆర్‌ఎస్ పాలనలో మహిళలకు సముచితమైన గౌరవాన్ని కల్పించేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి అన్నారు. సోమవారం తార్నాకకు చెందిన పలువురు మహిళలు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఆత్మీయ మహిళా మండలి వ్యవస్థాపకురాలు డా. లక్కరాజు నిర్మల, సులోచన, సుధ, వీణ, రమా, లత, విద్య ఉన్నారు.

హుండీల ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

చిలకలగూడ: చిలకలగూడ కట్టమైసమ్మ నల్లపోచమ్మ దేవాలయానికి హుండీ ద్వారా రూ. 1,74,781ల ఆదాయం వచ్చినట్లు ఈఓ మహేందర్‌గౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అండాల్ సమక్షంలో సోమవారం హుండీలను లెక్కించగా వచ్చిన ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు మహేందర్‌గౌడ్ తెలిపారు.

బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో..

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలోని హుండీలను సోమవారం లెక్కించగా రూ.23,40,092 ఆదాయం వచ్చిందని కార్యనిర్వాహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు. వీటిలో అన్నదానం రూపంలో రూ.61,691 వచ్చాయని, 4 యూఎస్ డాలర్స్ ఉన్నాయన్నారు. లెక్కింపులో చైర్మన్ సాయిబాబాగౌడ్, దేవాదాయ శాఖ అధికారులు సత్యనారాయణ నాయుడు పాల్గొన్నారు.

పీజీ సైన్స్‌కోర్సుల్లో మెడిసిన్, ఇంజినీరింగ్ విద్యార్థులకు అవకాశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలోని వివిధ ఎమ్మెస్సీ కోర్సుల్లో మెడిసిన్, ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నట్లు వీసీ ప్రొ.రవిందర్ తెలిపారు.ఈ విద్యా సంవత్సరం నుంచి ఓయూ దూరవిద్య బీఏ, బీకాం, బీఎస్సీ, ఇతర డిగ్రీ కోర్సులకు సెమిస్టర్ పరీక్షా విధానాన్ని ప్రవేశ పెట్టనున్నట్లు తెలిపారు. డిగ్రీ ఏదైనా దూర విద్య ఎంకాం కోర్సులో ప్రవేశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

శిశువిహార్‌లో చిన్నారి మృతి

అమీర్‌పేట: శిశు విహార్‌తో ఆశ్రయం పొందుతున్న చిన్నారి మృతి చెందిన సంఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పుట్టిన వారానికే తల్లిదండ్రులు బాలికను యూసుఫ్‌గూడలోని శిశువిహార్ అప్పగించారు. ప్రస్తుతం 3 నెలల వయస్సున్న చిన్నారి పుట్టినప్పటి నుంచే అనారోగ్యంతో బాధపడుతుంది.ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తడంతో ఈ నెల 24న నీలోఫర్‌లో చికిత్స చేయిస్తున్నారు. పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.15, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 11, క్యారెట్ 13, దొండ 40, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 55, కీర 14, దోసకాయ 37, బీట్‌రూట్ 13, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 15, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 4-6, ముల్లంగి 3-5.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురికి జైలు

రాంగోపాల్‌పేట్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురికి జైలు శిక్ష విధించారు. మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహ వివరాల ప్రకారం.. ఇటీవల మహంకాళి పోలీసులు జరిపిన డ్రంకెన్ డ్రైవ్‌లో మందు బాబులు పట్టుబడ్డారు. వారిని సోమవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా ఓ వ్యక్తికి ఏడు, ఒకరికి నాలుగు, ఇద్దరికి రెండు, మరో ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

అక్రమ నీటి వ్యాపారం అధికారులు అడ్డుకోరేం!

- శుద్ధినీటి పేరిట ప్రజలకు కుచ్చుటోపి
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న క్యాన్ల వ్యాపారం
- నిద్రమత్తులో అధికారులు
- అనారోగ్యాలకు గురవుతున్న జనాలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుద్ధి మంచినీటి పేరిట అక్రమ దందా కొనసాగుతుంది. వేసవిలో నీటి కొరత నేపథ్యంలో అనేక మంది తాగునీటి కోసం క్యాన్లతో సరఫరా చేసే మంచినీటిపై ఆధార పడుతున్నారు. మినరల్ వాటర్ పేరిట క్యాన్లలో సరఫరా చేస్తున్న మంచినీరు ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తోంది. కొంత మంది వాటర్ ప్లాంట్‌ల పేరిట అక్రమ నీటి దందాను మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విచ్చల విడిగా అక్రమ నీటి ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటి వ్యాపారంతో ప్రజల ఆరోగ్యానికి దెబ్బతీస్తున్నారనే ఆరోపణల హేతుబద్ధతను కాదనలేనిది. ప్రజల నీటి అవసరాలను ఆసరాగా చేసుకుంటూ వ్యాపారులు దోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు సైతం వెల్లువెత్తుతున్నాయి. భారతీయ ప్రమాణాల బ్యూరో(బీఐఎస్) నిబంధనలను తొసిరాజుతూ..నకిలీ ఐఎస్‌ఐ స్టిక్కర్లు వేసి క్యాన్లలో నీటిని విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం బీఐఎస్ అనుమతి పొందిన తర్వాతే వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే ఆచరణలో ఎక్కడ కూడా అనుమతులు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

◆ బోయిగూడ, రాణిగంజ్, ఓల్డ్‌బోయిగూడ, పద్మారావునగర్, మోండా మార్కెట్, సీతాఫల్‌మండి, తార్నాక, మెట్టుగూడ తదితర ప్రాంతాల్లో నీటి క్యాన్ల వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. వాస్తవాలు తెలియని అనేక మంది ప్రజలు వ్యాపారుల క్యాన్ల నీటిని వాడుకుంటూ అనారోగ్య పరమైన సమస్యలను తెచ్చుకుంటున్నారు. అధికారుల పర్యవేక్షణలోపం, నిబంధనల లేమీ వ్యాపారులకు అన్ని విధాలా కలిసి వస్తుంది. ఇంట్లో లేదా ఖాళీ స్థలంలో యంత్రాలు పెట్టి క్యాన్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. చిన్న చిన్న హోటళ్లు కాలనీలు దుకాణాల్లోకి తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. నీటి వల్ల వచ్చిన రోగం ఏదో తెలిసే లోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. వందల సంఖ్యలో ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి క్యాన్లలో నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రతి క్యాన్‌కు రూ. 20-30 నుంచి 100 వరకూ విక్రయిస్తున్నారు.



ఆటోలో క్యాన్లను తరలిస్తున్న దృశ్యం

ఇవి నిబంధనలు..

వాటర్ ప్లాంటు పెట్టాలంటే భారతీయ ప్రమాణాల బ్యూరో అనుమతి తప్పనిసరి. పరిశ్రమలు, విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి, బీఐఎస్ అనుమతి తీసుకోవాలి. నీటి వ్యాపారం చేసే వారు కచ్చితంగా ఐఎస్‌ఐ ప్రమాణాలు పాటించాలి. నీటి ప్లాంట్లు నుంచి క్యాన్ల ద్వారా నీటి సరఫరాతో వ్యాపార చేయాలంటే నిబంధనల ప్రకారం చాలా ఖర్చు అవుతుంది. ఈ అనుమతులతో పనిలేకుండా చాలా మంది అక్రమ ప్లాంట్లు పెట్టుకుంటున్నారు. ఐఎస్‌ఐ కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు సదరు ప్రాంతాన్ని సందర్శిస్తారు. శుభ్రత, నీటిని శుద్ధి చేయడానికి తగిన పరికరాలను పరిశీలిస్తారు. అన్ని ప్రమాణాలు సరిగా ఉంటే ఏడాదికి ఐఎస్‌ఐ గుర్తు ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తారు.

చర్యలు తీసుకోవాలి..



శుద్ధినీటి పేరిట సరఫరా అవుతున్న క్యాన్ల వ్యాపారాన్ని అధికారులు అడ్డుకోవాలి. వేసవిలో నీటి కొరత నేపథ్యంలో అనేక మంది క్యాన్ నీటిపై ఆధార పడుతున్నారు. నీటి అవసరాలను ఆసరాగా చేసుకొని ప్రజల ఆరోగ్యంతో ఆడుకుంటున్న సంస్థలు, వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి.

–గుంటి సత్యనారాయణ భోలక్‌పూర్

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి..



ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్న వాటర్ క్యాన్ల వ్యాపారంపై సంబంధిత అధికారులు స్పందించాలి. పెద్ద ఎత్తున నీటి వ్యాపారం జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరించడం సరికాదు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి చర్యలు తీసుకోవాలి.

–శివప్రసాద్, సీసీనగర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..



వాటర్ క్యాన్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఏ నీరు మంచిది ఏది ఆరోగ్యానికి హాని చేయకుండా ఉంటుందనే విషయాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. వేసవిలో దాహం వేసినప్పుడు ఎక్కడ పడితే అక్కడ నీరు తాగరాదు. శుద్ధమైన నీటిని తాగాలి.

–శివకుమార్, రాణిగంజ్

కేసీఆర్ హయాంలోనే తెలంగాణ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని

అమీర్‌పేట: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి సాధించిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని అమీర్‌పేట మున్సిపల్ మైదానంలో సోమవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంచి ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారన్నారు.

నీటి బిల్లులు కట్టొద్దు..

ఉచిత నీటి సరఫరా పతకం అమలులో ఉందని, అధికారులు నీటి బిల్లులు ఇచ్చినా ఎవరూ చెల్లించరాదని మంత్రి తలసాని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లిదండ్రులు తమ పిల్లల్ని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని స్పష్టం చేశారు. పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడంతో పాటు ఉచితంగా నాణ్యమైన భోజనం, యూనిఫాం, పుస్తకాలు అందిస్తున్నామన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి ద్వారా రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారని అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో గత 60 ఏళ్లలో జరగని అభివృద్ధి రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిందన్నారు. ఇక్కడి ప్రజల ఓట్లతో గెలుపొంది కేంద్ర మంత్రిగా కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కొలను లక్ష్మిబాల్‌రెడ్డి, నామన శేషుకుమారి, మహేశ్వరి, హనుమంత్‌రావు, గులాబ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పిస్తాహౌస్ రెస్టారెంట్ ప్రారంభం..

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఎస్డీరోడ్‌లోని క్లాక్‌టవర్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన పిస్తా హౌస్‌ను సోమవారం మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావు ప్రారంభించారు. భోజన ప్రియులకు రుచికరమైన, హైదరాబాద్ బ్రాండ్ ఫుడ్‌ను అందించడంలో నగరానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. రుచి, శుచితో వ్యాపారాలకు మార్కెట్‌లో మంచి పేరు లభిస్తుందని నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా ముందుకు వెళ్లాలని సూచించారు. ఎమ్మెల్సీ భోగారపు దయానంద్, కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు ఉప్పల శ్రీనివాస్‌గుప్త, తలసాని మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

అబాకస్ పోటీల్లో సత్తా





సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో షార్ప్‌మైండ్స్ అబాకస్ సంస్థ హిమాయత్‌నగర్, సికింద్రాబాద్ శాఖల విద్యార్థులు సత్తాచాటారు. పతకాలు సాధించిన విద్యార్థులను నారాయణగూడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం అభినందించారు. స్మార్ట్‌కిడ్స్ సంస్థ నగరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో భాగంగా పలు విభాగాల్లో షార్ప్ మైండ్స్ సంస్థ విద్యార్థులు ప్రతిభకనబరిచారు. రాష్ట్ర స్థాయిలో ఏ గ్రేడ్ విభాగంలో ప్రథమ ర్యాంకు వి.ఉష్మిసీ యాదవ్ సాధించగా, తృతీయ స్థానంలో పవిత్ సింగ్, బీ గ్రేడ్ విభాగంలో ప్రథమ స్థానంలో యశ్వంత్ గడ్డం నిలిచారని షార్ప్‌మైండ్స్ ఫౌండర్ పద్మావతి గోల్కొండ తెలిపారు. వివిధ విభాగాల్లో తుమ్మల వైభవ్, రోహిత్, నర్సింహారెడ్డి, నక్ష్ గుప్తా, అభినవ్ నగూర్, నతాషా గోల్కొండ, మాధవ్‌కొమ్మూరి, జెనిషా దశరథ్‌రావు కన్సొలేషన్ బహుతులు సాధించారన్నారు.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న విద్యార్థి నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌పీఎస్సీని వెంటనే రద్దు చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్ డిమాండ్ చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్ధన్‌రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మానవహారం చేపట్టారు. పేపర్ లీకేజీలపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించే వరకు 30 లక్షల మంది నిరుద్యోగులు వెంటాడుతూనే ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, వెంకన్నగౌడ్, ఈశ్వర్ లాల్, భాస్కర్, శ్రీనివాస్, సురేష్, రాకేష్, హర్షద్, సందీప్, సత్యం, సంతోష్, ఆనంద్, కుమార్, సతీష్, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషిచేస్తా



స్థానికులతో మాట్లాడుతున్న సదా కేశవరెడ్డి

రసూల్‌పురా: రసూల్‌పురా ఇందిరమ్మనగర్ పెద్ద రోడ్డులో నీరు రోడ్లపై చేరి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నా సమస్యను బోర్డు సీఈవో మధుకర్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి అన్నారు. సోమవారం ఇందిరమ్మనగర్ పెద్దరోడ్డు, 105 గల్లీలో అయన పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిత్యం భూగర్భ డ్రైనేజీ పైపులైను లీకేజీ జరుగుతోందని దీనికి తోడు నాలుగైదు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరిగిన సందర్భాల్లో తాగునీటి పైపులైను కూడా లీకేజీ జరిగి నీరు రోడ్ల పైకి చేరుతుందని స్థానికులు కేశవరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మనగర్ పెద్ద రోడ్డులో నీరు నిలిచే సమస్యను గతంలో సీఈవో దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోసారి సీఈవోకు తెలిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సూరి, జబ్బార్, మణికంఠ, అశోక్, పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న మహేశ్వరి

రాంగోపాల్‌పేట్: చిత్తశుద్ధితో బేగంపేట డివిజన్‌లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని కార్పొరేటర్ మహేశ్వరి అన్నారు. సోమవారం బర్ధన్‌కాంపౌండ్‌లో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న తాగునీటి పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. డివిజన్‌లో తాగునీరు, మురుగునీరు, రోడ్లు తదితర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని చెప్పారు. డివిజన్‌లో నిధులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దశలవారీగా విడుదల చేస్తూ అభివృద్ధి పనులు ఆగకుండా చొరవ తీసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమం శ్రీహరి, ఆరిఫ్, శ్రీనివాసరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సాయన్నకు మోండా నేతల నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోండా నేతలు

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్నకు మోండా డివిజన్ ఉపాధ్యక్షుడు, సొనాది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. సోమవారం మోండా డివిజన్ పర్యటనకు వచ్చిన సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత సమక్షంలో సాయన్న చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో ఏ చిన్న సమస్య ఉన్నా సాయన్న దృష్టికి తీసుకెళ్తే వెంటనే తగిన పరిష్కారం చూపేవారని గుర్తు చేశారు. అంబేడ్కర్‌నగర్, టీచర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో తరచూ రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని ఈ విషయమై తాను విజ్ఞప్తి చేయగా కోట్లాది రూపాయలు వెచ్చించి శాశ్వత పరిష్కారం చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, స్వామి, మల్లేష్, రమేష్, జయ, రూపమ్మ, లక్ష్మీ, జమున పాల్గొన్నారు.

వృద్ధురాలికి చేయూత

అడ్డగుట్టకు చెందిన లక్ష్మీ అనే వృద్ధురాలు కొంత కాలంగా షుగర్ వ్యాధితో బాధ పడుతుంది. ఈ క్రమంలో కాలికి గాయం కావడంతో ఇటీవల గాంధీ ఆస్పత్రిలో చికిత్సలో భాగంగా కాలు తీసేశారు. అనాథ అయిన ఆమెకు సపర్యలు చేసేందుకు ఎవరూ లేరు. రుద్రవీణ మహిళా సంఘం అధ్యక్షురాలు నక్క శోభ స్పందించి సదరు వృద్ధురాలిని బోయిగూడలోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో చేర్పించి మానవత్వాన్ని చాటుకున్నారు. –అడ్డగుట్ట



రూ.73 కోట్లతో అభివృద్ధి పనులు

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

చిలకలగూడ : సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా నిలిపేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అన్నారు. సీతాఫల్‌మండి క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గతేడాది కాలంలో జీహెచ్‌ఎంసీ ద్వారా రూ.67 కోట్లు, జలమండలి ద్వారా రూ. 6 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సీతాఫల్‌మండి కుట్టివెల్లోడీ ఆస్పత్రి పడకల సంఖ్యను 75 పెంచి, నూతన భవన నిర్మాణాలకు రూ. 12 కోట్లు, మాణికేశ్వరీనగర్, చిలకలగూడ ఆర్‌యూబీల నిర్మాణానికి రూ.50 కోట్లు, సీతాఫల్‌మండి జూనియర్, డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణాలకు రూ.29.75 కోట్ల నిధులు మంజూరయ్యాయని తార్నాక, అడ్డగుట్ట డివిజన్లలో మరో రెండు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తామన్నారు. 449 మహిళ పొదుపు సంఘాలకు రూ.19.98 కోట్ల రుణాలు, సీఎం సహాయనిధి ద్వారా 3100 మందికి వైద్యసహాయం కోసం రూ.29 కోట్లు అందించామన్నారు. వారాసిగూడ, చిలకలగూడ, లాలాగూడ, గోపాలపురం ట్రాఫిక్ ఠాణాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో జెడ్సీ శ్రీనివాసరెడ్డి, డీసీ దశరథ్, జలమండలి జీఎం రమణారెడ్డి, జీడీఎం కృష్ణ, ఈఈ ఆశాలత, డిప్యూటీ మేయర్ శ్రీలత, కార్పొరేటర్లు సామల హేమ, సునీత, శైలజ, ప్రసన్నలక్ష్మీ పాల్గొన్నారు.

ప్రజల మధ్యే ఉంటా.. సమస్యలు పరిష్కరిస్తా



మోండా డివిజన్‌లో పర్యటిస్తున్న లాస్య నందిత

కంటోన్మెంట్: నిత్యం ప్రజల మధ్యే ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత అన్నారు. సోమవారం మోండా డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, జేపీనగర్, లోహియా నగర్‌లో ఆమె స్థానిక నేతలతో కలిసి పర్యటించారు. అంబేడ్కర్ నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం తన తండ్రి సాయన్న హయాంలోనే నిధులు మంజూరయ్యాయని త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయన్నారు. మంగళవారం (నేడు) అంబేడ్కర్ ప్రధాన రహదారి సీసీ రోడ్డు, ఫుట్‌పాత్ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అనంతరం లోయనగర్‌లో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రం కోసం రూ. 10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నివేదిత, టీఎన్ శ్రీనివాస్, పనస సంతోష్, నాగినేని సరిత, సదనంద్ గౌడ్, సంతోష్ యాదవ్, పిట్ల నగేష్, నారాయణ, రాజయ్య, భాస్కర్, నిత్యానంద్, మురళి యాదవ్, తేజ్ పాల్, కసిరెడ్డి, నరేష్, శేఖర్, జోడీ బ్రదర్స్, నర్సింగ్ పాల్గొన్నారు.

సేఫ్టీ పరికరాలు లేకపోతే చర్యలు తప్పవు



కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

రాంగోపాల్‌పేట్: ఎస్డీరోడ్ ప్యారడైజ్ ప్రాంతంలోని హాంకాంగ్ బజార్‌లో సోమవారం అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రావు, డీఎఫ్‌వోలు సురేష్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు కాంప్లెక్స్ మొత్తం పరిశీలించారు. సెల్లార్ పరిశీలించి దుకాణాల యజమానులు, సిబ్బందితో మాట్లాడారు. ఎక్కువగా రద్దీగా ఉండే ఇలాంటి కాంప్లెక్స్‌లలో ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోకపోతే ప్రమాదాలు సంభవించినప్పుడు తీవ్ర ప్రాణనష్టం జరుగుతుందని ఫైర్‌సేఫ్టీ పరికరాలు కచ్చితంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు సులభంగా బయటకు వెళ్లేందుకు అత్యవసర మార్గాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కాంప్లెక్స్‌లలో సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

బీజేపీని విమర్శిస్తే గుణపాఠం తప్పదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రసూల్‌పురా: దివంగత ఎమ్మెల్యే సాయన్నను అడ్డు పెట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులు కంటోన్మెంట్‌లో సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని ఆదివారం జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళన సభ కాదని సాయన్న ఆత్మక్షోభ సభ అని బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ జైనపల్లి విమర్శించారు. బోర్డు పరిధిలో బీజేపీది తుగ్లక్ పాలన అని మంత్రి రాజశేఖర్‌రెడ్డి విమర్శలకు సోమవారం బొల్లారంలో ఆయన స్పందించారు. సాయన్నకు ఎమ్మెల్యే టికెట్ రాకుండా ప్రయత్నించి అభాసుపాలైన మల్లి రాజశేఖర్ రెడ్డివర్గం సాయన్న కుమార్తెలను వెంట తీసుకుని సానుభూతి పొందేందుకు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా బీజేపీ నాయకులు రామకృష్ణ పదవీ బాధ్యతలు చేపట్టిన ఈ రెండేళ్లల్లో కోట్లాది రూపాయలతో సీసీ రోడ్లు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ జరిగాయన్నారు. మరోసారి రామకృష్ణ, బీజేపీని విమర్శిస్తే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కిరణ్‌కుమార్, వినోద్, హేమంత్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృతజ్ఞత కూటమి



కృతజ్ఞత కూటమి వేడుకలో పాల్గొన్న చర్చి ప్రతినిధులు

చిలకలగూడ : హోసన్నా పెంతికోస్తు ఫెయిత్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో చిలకలగూడ హోసన్న చర్చిలో సోమవారం కృతజ్ఞత కూటమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిలకలగూడ మున్సిపల్ మైదానంలో ఇటీవల మూడ్రోజుల పాటు నిర్వహించిన సువార్త స్వస్థత సభలు విజయవంతమైన నేపథ్యంలో కృతజ్ఞత కూటమి వేడుకలు నిర్వహించినట్లు పాస్టర్ జాయ్, పాస్టరమ్మ జెమీలు తెలిపారు. హెచ్‌పీఎఫ్‌ఎమ్ వ్యవస్థాపకులు పాస్టర్ డేవిడ్‌రాజ్, రెబకమ్మ చిత్ర పటాలకు పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. సీనియర్ పాస్టర్ జెబ్‌రాజ్, పాస్టర్లు జాషువ, రాబర్ట్, షడ్రక్, శ్యామ్‌సన్, పాల్‌రెడ్డి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘ సలహాదారు ప్రసాద్‌తోపాటు సంఘ పెద్దలు, విశ్వాసులు పెద్దసంఖ్యలో పాల్గొని స్తుతి, స్తోత్రం నిర్వహించారు.

ఓయూ మైనింగ్ ఇంజినీరింగ్ విభాగానికి రూ.3 కోట్ల విరాళం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న మైనింగ్ ఇంజినీరింగ్ విభాగానికి కోల్ ఇండియా రూ.3 కోట్ల విరాళాన్ని అందజేశారు. సోమవారం ఓయూ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మైనింగ్ ఇంజినీరింగ్ కోర్సు బోధించు అధ్యాపకుల వేతనాలు, ఇతర వ్యయాల కోసం రూ.3 కోట్లను డిపాజిట్ చేసినట్లు కోల్ ఇండియా చైర్మన్ ప్రమోద్ మహాజన్, టెక్నికల్ డైరెక్టర్ వీరారెడ్డి, ఓయూ వీసీ ప్రొ.రవిందర్, కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఒప్పందాల పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం అందజేసుకున్నారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, సింగరేణి మాజీ డైరెక్టర్ బి.రమేష్‌కుమార్, జనరల్ సెక్రటరీ ఎంఎస్ వెంకట రామయ్య, గోపాల్‌రావు, డీఎస్ ప్రసాద్, పూర్వ విద్యార్థులు అమర్‌నాథ్, డీర్వీ సుశీల్‌కుమార్, మహేష్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నపై పెట్టిన కేసులు తొలగించాలి



మాట్లాడుతున్న సురేష్‌యాదవ్, వేదికపై ప్రముఖులు

ఉస్మానియా యూనివర్సిటీ: జర్నలిస్ట్ తీన్మార్ మల్లన్నకు అండగా ఉందామని పలువురు వక్తలు పేర్కొన్నారు. యూనివర్సిటీ లైబ్రరీలోని ఐసీఎస్ఎస్ఆర్ హాల్లో ఓయూ విద్యార్థి ఆధ్వర్యంలో మల్లన్న అరెస్టును ఖండిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ఓయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ సురేష్‌యాదవ్ అధ్యక్షత వహించగా టీజేఎస్ చైర్మన్ ప్రొ.కొదండరామ్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, బీజేపీ నేత వినోద్‌కుమార్, మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ఓయూ ప్రొ.గాలి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నేత బక్క జడ్సన్, తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ ఫ్రంట్ చైర్మన్ చనగాని దయాకర్‌గౌడ్, జర్నలిస్టు రఘు, మల్లన్న తల్లి జానకమ్మ, భార్య మమత, ఓయూ విద్యార్థి నాయకులు పాల్గొని ప్రసంగించారు. మల్లన్నపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలన్నారు.